సాక్షి తిరుపతి

మంగళవారం । 27 । ఆగస్టు । 2024



'రాజు' గారి 'కథ'

పుత్తూరు మండలం రాచపాళెం గ్రామానికి చెందిన ఆర్‌సీ కృష్ణస్వామిరాజు 40 ఏళ్లుగా కథలు రచిస్తున్నారు. - 8లో



శ్రీకృష్ణావతారంలో నృసింహుడు

పెంచలకోనలో శ్రీపెనుశిల లక్ష్మీనృసింహస్వామివారు సోమవారం శ్రీకృష్ణుని అలంకరణలో దర్శనమిచ్చారు. - 8లో



పంట మునిగినా.. పంతమే ముఖ్యం!

చిల్లకూరు పెద్ద చెరువు అభివృద్ధి పనులను టీడీపీ నేతలు కుట్రపూరితంగా పోలీసులను పంపించి అడ్డుకున్నారు. - 8లో

చట్టాలు అవసరం



కోల్‌కతాలో పీజీ వైద్య విద్యార్థినిపై జరిగిన అమానుషం పునరావృతం కాకుండా కఠినమైన చట్టాలు తీసుకురావడం అత్యంత అవసరం. మహిళలపై లైంగికదాడులకు పాల్పడాలంటే వణుకు పుట్టేలా నిందితులకు శిక్ష విధించాలి. బిడ్డలే సర్వస్వం అనుకుని వారి కోసం బతికే తల్లిదండ్రులకు కడుపుకోతను మిగిల్చే అధికారం ఎవరికీ లేదు. సమాజంలో మార్పుతోనే మహిళలపై దాడులను అరికట్టేందుకు వీలవుతుంది. ఆ దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. ఈ క్రమంలోనే ఆస్పత్రుల్లో భద్రతను కట్టుదిట్టం చేయాలి.

– డాక్టర్ నీలిమ, తిరుపతి



సేఫ్‌జోన్‌గా ప్రకటించాలి



మహిళా వైద్యుల రక్షణకు వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. ఆస్పత్రుల ప్రాంగణాలను సేఫ్‌జోన్‌గా ప్రకటించి మూడంచెల భద్రత కల్పించాలి. సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను తక్షణం అమలు చేయాలి. ప్రభుత్వాస్పత్రుల్లో పోలీస్ ఔట్ పోస్టులను బలోపేతం చేయాలి. ఉద్యోగ విరమణకు సమీపంలో ఉన్నవారితో కాకుండా యువపోలీసులను ఔట్‌పోస్టుల్లో నియమించాలి. మహిళా వైద్యుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలి.

– డాక్టర్ వరప్రసాద్, తిరుపతి

న్యూస్‌రీల్

మున్సిపల్ శాఖలో ఆన్‌లైన్ బదిలీలు

- రాష్ట్రవ్యాప్తంగా టీడీఆర్ బాండ్లపై లోతైన విచారణ
- రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ



మాట్లాడుతున్న మంత్రి నారాయణ

తిరుపతి తుడా: రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో ఆన్‌లైన్ బదిలీల విధానాన్ని అమలు చేస్తామని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ స్పష్టం చేశారు. తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చిన ఆయన సోమవారం మున్సిపల్ కార్పొరేషన్, తుడా అధికారులతో తుడా కార్యాలయంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆ సంస్థల ఆర్థిక అంశాలు, అభివృద్ధి పురోగతి, విధివిధానాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో దొంగ ఓట్ల నమోదుపై వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా కేంద్ర ఎన్నికల సంఘం దర్యాప్తు చేస్తుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా గత ప్రభుత్వంలో విడుదల చేసిన టీడీఆర్ బాండ్లపైన సీఐడీ లోతైన విచారణ జరుపుతున్నదని వివరించారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు డ్రైనేజీ వాటర్ శుద్ధి కోసం వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను అన్ని మున్సిపాలిటీల్లో అభివృద్ధి చేస్తామన్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.350 కోట్లను కేటాయించిందని తెలిపారు. మున్సిపాలిటీల్లో ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా కమిషనర్లు వేగంగా ప్రజా ఫిర్యాదులను పరిష్కరించాలని ఆదేశించినట్లు మంత్రి చెప్పారు.

నకిలీ ఉద్యోగ ప్రకటనలు నమ్మవద్దు

శ్రీసిటీ(సత్యవేడు): శ్రీసిటీలోని ఎక్సలెంట్ ఫార్మాసైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట కొందరు మోసపూరితంగా నకిలీ ఉద్యోగ ప్రకటనలు ఇస్తున్నారని, వాటిని నమ్మవద్దని కంపెనీ హెచ్‌ఆర్ అడ్మినిస్ట్రేషన్ సీనియర్ మేనేజర్ కె.విజయ భాస్కర్ రెడ్డి కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ axxelentpharama.com,hr@axxelentpharma. com పేరిట ఒక నకిలీ వెబ్‌సైట్, మెయిల్ ఐడీ ఉపయోగిస్తూ, ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ కొందరు భారీగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. మోసగాళ్ల వలలో పడి ఎవరూ నష్టపోవద్దని హెచ్చరించారు. పైన చెప్పిన వెబ్‌సైట్, మెయిల్ ఐడీలతో తమ సంస్థకు ఎలాంటి సంబంధం లేదన్నారు. మోసగాళ్లపై తమ కంపెనీ తరఫున చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇప్పటికే ఎవరైనా నష్టపోయి ఉంటే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. axxelent.com,hr.a1@axxelent.com తమ అధికారిక వెబ్‌సైట్, మెయిల్ ఐడీలని వివరించారు.

తిరుమలలో అష్టమి ఏర్పాట్లు

తిరుమల: తిరుమలలో మంగళవారం శ్రీకృష్ణ జన్మాష్టమి, బుధవారం ఉట్లోత్సవం నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. అష్టమి రోజున శ్రీవారి ఆలయంలోని బంగారు వాకిలి చెంత రాత్రి 8 నుంచి 10 గంటల నడుమ దేవదేవేరులతోపాటు, శ్రీకృష్ణస్వామికి ఏకాంత తిరుమంజనం నిర్వహించనున్నారు.

నోటు కొట్టు.. పోస్టు పట్టు!

సంపాదనే లక్ష్యంగా కూటమి నేతలు పరుగులు తీస్తున్నారు. అవకాశాలను అందిపుచ్చుకుంటూ కాసులు వెనకేసుకుంటున్నారు. ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు అన్నట్టు మూకుమ్మడిగా పేట్రేగిపోతున్నారు. అందులో భాగంగానే ప్రభుత్వోద్యోగుల బదిలీల్లో సైతం తమ హవా నడిపిస్తున్నారు. ప్రాధాన్యతా పోస్టుల కోసం పాకులాడే అధికారులను ఆదాయ వనరులుగా మార్చుకుంటున్నారు. కోరుకున్న చోటుకు ట్రాన్స్‌ఫర్ చేయించేందుకు రూ.కోట్లు వసూలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఉద్యోగులు సైతం కీలకమైన సీటు దక్కించుకునేందుకు ముఖ్య నేతలు అడిగినంత సొమ్ము చెల్లించుకుంటున్నారు. బదిలీల ప్రక్రియ తుది అంకానికి చేరిన నేపథ్యంలో మరింత ముమ్మరంగా పైరవీలు సాగిస్తున్నారు.





సాక్షి ప్రతినిధి, తిరుపతి : ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ఉద్యోగుల బదిలీలు క్లైమాక్స్‌కు చేరాయి. వెబ్ ఆప్షన్స్‌కు కూడా నేటితో తెరపడనుంది. రెండు మూడు రోజుల్లో ఎవరెవరు ఎక్కడెక్కడికి బదిలీ అవుతున్నారో తేలిపోనుంది. ఈలోపు అధికారులు కోరుకున్న చోటుకు బదిలీ చేసుకునేందుకు కూటమి నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. కొందరు ఉద్యోగులు ఇప్పటికే మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలు కూడా సమర్పించారు. మరి కొందరు కూటమి నేతలు అడిగినంత ఇచ్చి కోరిన చోటుకు బదిలీ చేయించుకునేందుకు పైరవీలు సాగిస్తున్నారు. కూటమి ప్రభుత్వంలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ముఖ్య నాయకులు తాము అడిగిన పనులు చేసిపెట్టే అధికారుల కోసం తాపత్రయపడుతున్న విషయం తెలిసిందే. అదే విధంగా అధికారులు కూడా కూటమి నేతల ప్రాపకం పొంది నచ్చిన చోటుకు బదిలీపై వెళ్లేందుకు తీవ్రస్థాయిలో యత్నిస్తున్నారు. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన జరుగుతున్న బదిలీల్లో ఇప్పటికే పోలీసు, రెవెన్యూశాఖల్లో బదిలీలు ముగింపు దశకు చేరుకున్నాయి. అక్కడక్కడ కొందరు డిప్యూటీ కలెక్టర్లు, ఆర్డీఓ, తహసీల్దార్లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు,వీఆర్‌ఓల బదిలీలు మిగిలి ఉన్నాయి. ఇంకా ఆర్‌అండ్‌బీ, జలవనరులశాఖ, సబ్ రిజిస్ట్రార్లు, ఆర్‌డబ్ల్యూఎస్, సివిల్ సప్లయ్, మైనింగ్ శాఖల్లోనూ పూర్తి స్థాయిలో బదిలీలు జరగనున్నాయి. ఆయా శాఖల్లో అధికారులు ఎక్కువ మంది తిరుపతి జిల్లాకు రావడానికే మొగ్గుచూపుతున్నట్లు తెలిసింది. ఎటువంటి ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా ఉండాలనుకునే వారు మాత్రం చిత్తూరు జిల్లాకు వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం.

ఉన్నతాధికారి బంధువుదే కీలకపాత్రం

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వద్ద పనిచేసే ఓ అధికారి తండ్రి తిరుపతి రెవెన్యూశాఖలో పనిచేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న అధికారులు కొందరు అతడి ఇంటికి క్యూకట్టారు. అన్ని శాఖల అధికారులు సదరు వ్యక్తిని ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. అందులో భాగంగా ఆయన ఇప్పటికే కొందరిని సిఫారసు కూడా చేసినట్లు విశ్వసనీయ సమాచారం. అందు కోసం ఆయన స్థాయిలో మామూళ్లు పుచ్చుకుంటున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఇప్పటికే ఆ అధికారి తిరుపతి అర్బన్ పరిధిలో విలువైన భూములను డబ్బులు తీసుకుని కూటమి నేతలకు దారాదత్తం చేస్తున్నారు. అందులో తిరుపతి అర్బన్ పరిధిలోని రూ.కోట్లు విలువచేసే కొంకచెన్నాయిగుంట, అన్నా చెరువు అక్రమణలే కావడం గమనార్హం.

ఐదేళ్లు పూర్తి కాకపోయినా..

ఐదేళ్లు పూర్తయిన వారందరినీ బదిలీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయితే కూటమి నేతల ఒత్తిడితో రెండు, మూడేళ్లు పూర్తి కాని వారిని కూడా బదిలీ చేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను పనిగట్టుకుని బదిలీ చేయించేందుకు కూటమి నేతలు ప్రయత్నిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నియమింపబడ్డారనే కారణంతో వీరిపై బదిలీ వేటు వేయిస్తున్నారు. ఇప్పటికే అధికారపార్టీ నేతల వేధింపులతో సచివాలయ ఉద్యోగులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. గ్రామ, వార్డు స్థాయి కార్యకర్తలు సైతం సచివాలయ ఉద్యోగులను బదిలీపై వెళ్లిపోండంటూ హుకుం జారీ చేస్తుండడంతో ఆందోళనలో ఉన్నారు. మీరు వెళ్లిపోతే మా బంధువులను తెచ్చుకుంటామని పచ్చమూక బహిరంగంగానే చెబుతుండడంతో ఆవేదన చెందుతున్నారు. కూటమి నేతలు బెదిరింపులను భరించలేక ఉద్యోగులు ఎక్కడకు బదిలీ చేసినా వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది.

మేమూ తగ్గం!

రెవెన్యూలో కీలకమైన వీఆర్‌ఓలు కోరుకున్న ప్రాంతాలకు బదిలీ చేసుకునేందుకు పోటీపడుతున్నారు. తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి, నగరి, సత్యవేడు, సూళ్లూరుపేట, గూడూరు పరిధిలో వీఆర్‌ఓలు కొందరు విలువైన భూములు ఉన్న ప్రాంతాలకు బదిలీపై వెళ్లేందుకు అధికారపార్టీ నేతల ద్వారా ప్రయత్నాలు సాగిస్తున్నారు. మేము వస్తే.. ప్రభుత్వ భూములను మీరు కోరినట్లు చేసిపెడుతామంటూ కూటమి నేతలకు ప్రామిస్ కూడా చేస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే ఓ వీఆర్‌ఓ అయితే ఏకంగా రూ.25 లక్షలను కూటమి నేతలకు ముట్టజెప్పేందుకు సిద్ధమైనట్లు రెవెన్యూ శాఖలో ప్రచారం జరుగుతోంది.

తిరుపతికే తొలి ప్రాధాన్యం

అనంతపురం, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో పనిచేసే రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్, రిజిస్ట్రార్ శాఖల్లో పనిచేస్తున్న ముఖ్య అధికారులంతా తిరుపతి జిల్లాకు బదిలీ చేసుకోవడానికే ప్రాధాన్యమిస్తున్నారు. ముఖ్యంగా జలవనరుల శాఖలో పనిచేసే నలుగురు చీఫ్ ఇంజినీర్లు అయితే కూటమి నేతలకు రూ.3 కోట్లు కూడా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే తహసీల్దార్ బదిలీలకు సంబంధించి కూటమి నేతలు రూ.2కోట్ల వరకు డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. అలాగే డీఈ స్థాయి అధికారులు సంపాదించుకునే అవకాశం ఉన్న చోట్లకు వెళ్లేందుకు మొగ్గుతున్నారు. ఇకపోతే సబ్ రిజిస్ట్రార్లు కొందరు తిరుపతి, తిరుపతి రూరల్, రేణిగుంట, శ్రీకాళహస్తి, తొట్టంబేడు కోసం మంత్రి స్థాయిలో చెప్పించుకుంటున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పనిచేసే సీనియర్ అసిస్టెంట్లు ఉద్యోగోన్నతి కోసం అమరావతి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఎంత అడిగితే అంత ఇచ్చుకోవటానికి వెనుకాడడం లేదని విశ్వసనీయంగా తెలిసింది. తిరుపతి డీపీఓ, గురుకుల పాఠశాలల జిల్లా కో–ఆర్డినేటర్ పోస్టుల కోసం కొందరు పోటీపడుతున్నారు. అలాగే మున్సిపల్ కమిషనర్లు సైతం పలు స్థానాలను ఆశిస్తున్నారు. ప్రధానంగా గూడూరు, శ్రీకాళహస్తి, పుత్తూరు మున్సిపాలిటీలకు వెళ్లేందుకు భారీగా పోటీపడుతున్నారు.

ఫుట్‌బాల్‌లో విద్యార్థుల ప్రతిభ



బాలప్రదీప్



చేతన్

నాయుడుపేటటౌన్ : విజయవాడలో నిర్వహించిన అంతర్ జిల్లాల ఫుట్‌బాల్ టోర్నీలో నాయుడుపేట విద్యార్థులు సత్తా చాటారు. సోమవారం ఈ మేరకు పీఈటీ మునస్వామి మాట్లాడుతూ అండర్–14 విభాగంలో జిల్లా జట్టుకు ఎంపికైన బాల ప్రదీప్, చేతన్ తమ జట్టును సెమీఫైనల్స్‌కు చేర్చడంలో కీలక పాత్ర పోషించినట్లు తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూ లైన్ టీబీసీ వద్దకు చేరుకుంది. ఆదివారం అర్ధరాత్రి వరకు 84,060 మంది స్వామివారిని దర్శించుకోగా 34,985 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.01 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శనం టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయం కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలైన్ లో అనుమతించరని తెలియజేశారు.

రేపటి వరకు పీజీ వెబ్ ఆప్షన్లకు అవకాశం

తిరుపతి సిటీ: జిల్లాలోని వర్సిటీల పరిధిలో ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకాం కోర్సులలో అడ్మిషన్ల కొరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన పీజీసెట్–2024 వెబ్‌ఆప్షన్లకు బుధవారం వరకు అవకాశం కల్పిస్తున్నట్లు పీజీసెట్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఈ నెల 23వరకు వెబ్‌ఆప్షన్లకు చివరి తేదీగా నిర్ణయించిన అధికారులు విద్యార్థుల విన్నపం మేరకు ఈ నెల 28వరకు పొడిగిస్తున్నట్లు తెలియజేశారు. 29వతేదీ ఆప్షన్ల మార్పులకు అవకాశమిస్తూ, 31వతేదీన మొదటి విడత సీట్లు కేటాయింపు ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. సీట్లు పొందిన విద్యార్థులు ఆయా వర్సిటీలలో వచ్చేనెల 2వతేదీ నుంచి 5వతేదీ లోపు ఒరిజిన్ ధృవపత్రాలతో అడ్మిషన్లు పొందాలని తెలిపారు.







● కృష్ణా.. నవనందకిశోరా..!

సుగంధ సుమాల నడుమ చిరునవ్వులు చిందిస్తున్న గోపికాప్రియవల్లభుని వీక్షించి భక్తులు పరవశులయ్యారు.. సుమనోహర అలంకరణల నడుమ రాధా సమేతంగా కొలువుదీరిన చిలిపి కృష్ణుని దివ్యతేజస్సును దర్శించి మైమరచిపోయారు.. పిల్లనగ్రోవి చేతబట్టిన నల్లనయ్య మంగళస్వరూపాన్ని సేవించుకుని పునీతులయ్యారు.. సకలలోకాలకు శుభాలను అనుగ్రహించే గోవర్ధనగిరిధారిని మనసారా స్మరించుకుని తన్మయత్వం చెందారు.. సోమవారం తిరుపతి నగరంలోని ఇస్కాన్ మందిరంలో అత్యంత వైభవంగా నిర్వహించిన శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగస్వాములై పులకించారు.. ఈ సందర్భంగా చేపట్టిన ఉట్లోత్సవంలో యువకులు పాల్గొని ఉత్సాహంగా కేరింతలు కొట్టారు.. కొంటె కృష్ణుని లీలను జ్ఞప్తికి తెచ్చుకుని మురిసిపోయారు.

– తిరుపతి కల్చరల్

ఖాళీ బస్సుల కహానీ!

- డిపోలవారీగా సర్వీసుల వివరాలు
- 31లోపు నివేదిక ఇవ్వాలని ఆదేశాలు
- కసరత్తు చేస్తున్న ఆర్టీసీ అధికారులు

తిరుపతి అర్బన్ : జిల్లాలో మళ్లీ ఖాళీ బస్సుల కహానీ మొదలైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రమాణస్వీకారం చేసినప్పటి నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై ఊరిస్తూనే ఉన్నారు. ఆ మేరకు ఆర్టీసీ అధికారులు సైతం అదిగో.. ఇదిగో ఆదేశాలు వచ్చేస్తున్నాయని నానా హంగామా చేసేశారు. తొలుత జూన్ 30వ తేదీ నాటికి జిల్లాలో ఖాళీగా తిరిగే సర్వీసుల వివరాలతో నివేదికలు పంపించాలని ఉన్నతాధికారులు ఆయా డీఎంలకు ఉత్తర్వులు జారీ చేశారు. తర్వాత ఆ నివేదికలను కాస్తా బుట్ట దాఖలు చేశారు. ఈ క్రమంలో మళ్లీ ఖాళీ బస్సులపై నివేదికలను ఈ నెల 31వ తేదీలోపు పంపించాలని ఆదేశించారు.

మళ్లీ కసరత్తు

ఆర్టీసీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డిపోల వారీగా బస్సుల ఖాళీల వివరాల సేకరణలో డీఎం నిమగ్నమయ్యారు. ఈ నెల 31వ తేదీకి జిల్లా కార్యాలయానికి చేర్చేందుకు మళ్లీ కసరత్తు చేస్తున్నారు. . జిల్లాలోని 11 డిపోల్లో ఎన్ని సర్వీసులున్నాయి. మొత్తం 743 బస్సులు నడుస్తున్నాయి. మరో 100 విద్యుత్ బస్సులు ఉన్నాయి. వీటిలో 100శాతం కండిషన్‌లో ఉండేవి ఎన్ని.. 75శాతం కండిషన్ బస్సులు ఎన్ని..50శాతం బస్సులు ఏవి, 25శాతం బస్సుల సంఖ్య ఏంటో స్పష్టంగా సమాచారం సేకరిస్తున్నారు. ఉచిత బస్సు పథకం ఎప్పుడు ప్రారంభమవుతుందో తెలియదు కానీ, నివేదికల పేరుతో తమను మాత్రం వేధిస్తున్నారని ఆర్టీసీ అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తిరుపతి సెంట్రల్ బస్టాండ్

అనుచరుల జోరు.. అధికారుల బేజారు!



సమీక్షలో మంత్రి, అధికారులతోపాటు కూటమి నేతలు

తిరుపతి తుడా : తిరుపతి తుడా కార్యాలయంలో సోమవారం పురపాలక శాఖ మంత్రి నారాయణ అధికారులతో సమీక్ష నిర్వహించారు.కార్పొరేషన్ కమిషనర్ ఎం.మౌర్య, తుడా సీసీ వెంకటనారాయణతో పాటు ఆయా శాఖాధిపతులందరూ హాజరయ్యారు. ఈ క్రమంలోనే తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సైతం పాల్గొన్నారు. తుడా, మున్సిపల్ కార్పొరేషన్ ఆర్థిక వ్యవహారాలు, అభివృద్ధి పనులు, చేపట్టాల్సిన అంశాలు, చేపట్టబోయే కార్యక్రమాలపై చర్చించారు. కమిషనర్ మౌర్య పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తిరుపతిలోని అభివృద్ధి ప్రాజెక్టులను వివరించారు. అయితే అధికారిక కార్యక్రమంలో కూటమి నేతలు హల్‌చల్ చేయడం విమర్శలకు దారితీసింది. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, ఆమె అల్లుడు సంజయ్, జనసేన నేత పసుపులేటి హరిప్రసాద్, టీడీపీ నాయకులు ఊట్ల సురేంద్ర నాయుడు, సుబ్రమణ్యంనాయుడు, బుల్లెట్ రమణ, సుధాకర్ రెడ్డితోపాటు పులివర్తి నాని అనుచరవర్గం హాజరుకావడంతో అధికారులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు.


తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.74,270
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.6,723
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.88,700
రిటైల్ వెండి గ్రాము	రూ.91.70

మహిళలు తలెత్తుకుని తిరగాలి



రాత్రివేళల్లో సైతం మహిళలు తలెత్తుకుని తిరిగేలా ఉండాలి. కోల్‌కతా ఘటన అవమానకరం. ఇలాంటి వాటితో మహిళా డాక్టర్ల ధైర్యం సన్నగిల్లుతోంది. నైట్ డ్యూటీలు చేసే మహిళా డాక్టర్లకు రక్షణ కరువైతే విధులకు హాజరుకాలేరు. వీరికి అన్ని విధాలా రక్షణతోపాటు సౌకర్యాలు కల్పించాలి. లేకుంటే పగటి వేళల్లో విధులు నిర్వహించేలా చూడాలి.

– డాక్టర్ నర్మదాదేవి, ప్రభుత్వ వైద్యులు, రాపూరు



వైద్యుల రక్షణ ప్రభుత్వ బాధ్యత



ఆసుపత్రుల్లో వైద్యులు, నర్సులు, సిబ్బంది రక్షణను ప్రభుత్వమే బాధ్యతగా తీసుకోవాలి. ఇటీవల జరుగుతున్న కొన్ని సంఘటనలు మాలో భయాందోళన కలిగిస్తున్నాయి. డాక్టర్లు అంటే దేవుళ్లుగా భావించే మన దేశంలో ఇలాంటి దారుణాలు జరగడం బాధాకరం. మాకూ కుటుంబాలు ఉంటాయన్న విషయాన్ని అందరూ గుర్తించాలి. ప్రభుత్వం మాకు రక్షణ కల్పించాలి.

– నజ్మ, ప్రభుత్వ వైద్యులు, రాపూరు

రాజు గారి కథ

కథలు రాయడమంటే చిన్న విషయం కాదు.. ఆలోచనలకు పదును పెట్టాలి.. సమాజంలోని స్థితిగతులను ఆకలింపు చేసుకోవాలి..యాసతో ఆకట్టుకోవాలి.. సామాజిక స్పృహను ప్రతిబింబించాలి..అనుభవాలను రంగరించాలి.. పాఠకులను అలరించాలి.. కాలంతో పోటీ పడుతూ పరుగులు పెట్టాలి.. ఇందుకు కాగితంపై అక్షర సేద్యం చేయాలి.. ఇలా నాలుగు దశాబ్దాలుగా అలుపెరగని ఓ 'రాజు' గారి కథపై ప్రత్యేక కథనం.

- 'పుత్తూరు కట్టు' కుటుంబంలో కథకుడు
- నాలుగు దశాబ్దాలుగా అలుపెరుగని రచయిత
- 560 కథలు, 15 కథల పుస్తకాలు, ఓ నవల ఆవిష్కరణ







గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో టాక్ ది బుక్‌గా ఎంపికైన గాండ్ల మిట్ట కథలు

పుత్తూరు : పుత్తూరు మండలం రాచపాళెం గ్రామానికి చెందిన ఆర్‌సీ కృష్ణస్వామిరాజు సుమారు 40 ఏళ్లుగా తన రచనలతో ఆబాలగోపాలాన్ని ఆకట్టుకుంటున్నారు. రాయలసీమ నేపథ్యం, పల్లె జీవితం, అనుబంధాలు, అలవాట్లు, సంప్రదాయాలు, సమకాలీన పరిస్థితులే ఆయన కథా వస్తువులు. వీటినే ఆధారంగా చేసుకుని ఇప్పటి వరకు సామాజిక కథలు, బాలల కథలు, ఆధ్యాత్మిక కథలు, హాస్య కథలు అంటూ మొత్తం 560 కథలు, 15 కథా సంపుటిలు, ఒక నవలను ఆయన రచించారు. బాల సాహిత్యం, హాస్యం, ఆధ్యాత్మికం, మాండలికాల విశిష్టతను చాటిన రాజుగారి కథలు ప్రచురితం కాని దినపత్రిక లేదు అంటే అతిశయోక్తి కాదు. ఆయన కథలు చదవడమంటే పాఠకుడికి పంచభక్ష్య పరమాన్నం అందించినట్లే.

ప్రస్థానం ఇలా..

కృష్ణస్వామిరాజు 1982లో తిరుపతి ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ చేస్తున్న రోజుల్లో హోటల్‌కు వెళ్లి టిఫిన్ చేస్తుండగా ఓ వ్యక్తి ఎదురుగా వచ్చి కూర్చున్నాడు. టిఫిన్ చేసి నవ్వుతూ పలకరించి వెళ్లిపోయాడు. తర్వాత సర్వర్ వచ్చి కృష్ణస్వామికి ఇద్దరి బిల్లు ఇచ్చాడు. అతడెవరో తనకు తెలియదని కృష్ణస్వామి చెప్పినా సర్వర్ పట్టించుకోలేదు. ఇద్దరూ నవ్వుతూ మాట్లాడుకున్నారు కదా.. మీ మనిషే అనుకున్నా.. బిల్లు కట్టి ఇక్కడ నుంచి కదులు అని పట్టుబట్టాడు. దీంతో విధిలేక కృష్ణస్వామి బిల్లు కట్టి బయటపడ్డాడు. ఈ వింత అనుభవం మనసులో పదే పదే మెదులుతూ ఆయనకు కొత్త కథా వస్తువును అందించింది. ఇదే అనుభవాన్ని కాగితంపై పెట్టి ''బిల్లు కట్టాల్సిందే'' పేరిట తొలి కథతో ఆయన రచనా ప్రస్థానం మొదలైంది. తర్వాత 1984లో 'ఈ కాలం పిల్లలు' కథ తొలిసారిగా ఓ దినపత్రికలో ప్రచురితమైంది.

కట్టు కుటుంబం నుంచి..

రాచపాళెం (ఈశ్వరాపురం) ఈ పేరు చెప్పగానే వెంటనే గుర్తుకొచ్చేది పుత్తూరు కట్టు. జాతీయస్థాయిలో ఖ్యాతి గడించిన పుత్తూరు శల్య వైద్యుల కుటుంబానికి చెందిన రాచకొండ చెంగ్రాజు, నారాయణమ్మల ఎనిమిదో సంతానం కృష్ణస్వామిరాజు. ఆయన 1962 డిసెంబర్ 19వ తేదీన జన్మించారు. పోస్టుగాడ్యుయేషన్, జర్నలిజంలో డిప్లొమా చేశారు. ఓ దినపత్రికలో రిపోర్టర్‌గా ప్రస్థానం ప్రారంభించారు. అనంతరం ఎల్‌ఐసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. ఆయన సతీమణి మీనాక్షి సైతం హిందీ ఉపాధ్యాయినిగా విధులు నిర్వర్తిస్తున్నారు. పిల్లలు పూజిత, శేషసాయి ఇంజినీరింగ్‌లో పీజీ చేశారు. ప్రస్తుతం తిరుపతిలోనే కృష్ణస్వామిరాజు స్థిరనివాసం ఏర్పరుచుకున్నారు.

పుస్తకాలు..పురస్కారాలు..

కృష్ణస్వామిరాజు రచనల్లో పుత్తూరు పిల్ల'గోడు', ముగ్గురాళ్ల మిట్ట, సల్లో సల్ల, గాండ్ల మిట్ట, రాజుగారి కథలు, రాణిగారి కథలు, కార్వేటినగరం కథలు, నాన్నారం కథలు, యోగక్షేమం వహామ్యహం, రాజనాల బండ, పకోడీ పొట్లం, దుశ్శాలువా కప్పంగ, కిష్టడి కథలు. గతం గతః, మిక్చర్ పొట్లం, మేకల బండ (నవల) పేరుపొందాయి. ఈ క్రమంలోనే ఆయన పలు పురస్కారాలు అందుకున్నారు.

- ముగ్గురాళ్ల మిట్ట సంపుటికి శ్రీమక్కెన రామసుబ్బయ్య స్మారక పురస్కారం.
- సల్లో సల్ల, కార్వేటినగరం కథల సంపుటికి శివేగారిదేవమ్మ స్మారక కథా పురస్కారం.


తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారంతో కృష్ణస్వామిరాజు (ఫైల్)

- పకోడి పొట్లం పుస్తకానికి రావూరి భరద్వాజ పురస్కారం
- గాండ్ల మిట్ట పుస్తకానికి సాహితీకిరణం పురస్కారం
- రాజు గారి కథలు బాలల పుస్తకం.. విజయనగరం జిల్లా పార్వతీపురం నారంశెట్టి బాల సాహిత్య పీఠం వారిచే ఉత్తమ గ్రంథంగా ఎంపికైంది.
- సాహితి సేవకు తిరుపతి విశ్వశ్రీ సాహితీ సమాఖ్య వారి గార్లపాటి పురస్కారం
- చక్కటి హాస్య రచనలు చేస్తున్నందుకు తెలుగు విశ్వవిద్యాలయం వారు 2020కి కీర్తి పురస్కారం
- 2023లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి వారు ''టాక్ ది బుక్'' కార్యక్రమంలో గాండ్ల మిట్ట, మేకల బండ పుస్తకాలపై ప్రత్యేక సమీక్ష కార్యక్రమాలు నిర్వహించారు.
- గాండ్ల మిట్ట పుస్తకంపై చెన్నై ప్రెసిడెన్సీ కాలేజీలో ఓ పరిశోధనా విద్యార్థిని ఎంఫిల్ పూర్తి చేసింది.

శిక్షణ ఇస్తున్నా



ఉప్పు, కారం, తీపి, చేదుల సమ్మిళితం నా బాల్యం. నా కథలకు ముడి సరుకు పూర్తిగా నా బాల్యం, నా గ్రామం, నా కుటుంబ నేపథ్యం. సామాజిక స్పృహతో, వాస్తవాలకు దగ్గరగా, అందరికీ అర్థమయ్యేలా సులభతర భాషలో మరిన్ని మంచి రచనలు చేయాలన్నదే నా .లక్ష్యం. అలాగే అవకాశం దొరికినప్పుడల్లా పిల్లలకు కథలు రాయడం ఎలా? అనే అంశంపై తిరుపతిలో శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నా. – ఆర్‌సీ కృష్ణస్వామిరాజు

మాడ వీధులను పరిశీలించిన సీవీఎస్‌ఓ

తిరుమల: తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 4 నుండి 12వ తేదీ వరకు జరగనున్న నేపథ్యంలో భద్రతాపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సోమవారం టీటీడీ సీవీఎస్‌ఓ శ్రీధర్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సీవీఎస్‌ఓ భక్తుల రద్దీకి అనుగుణంగా భద్రతా ఏర్పాట్లు విస్తృతంగా చేపట్టాలన్నారు. వాహన మండపం, భక్తుల గ్యాలరీల్లోనికి వచ్చేందుకు మాడ వీధులలో ప్రవేశ, నిష్క్రమణ ద్వారాలు, గ్యాలరీల్లోని ముఖ్యమైన ప్రాంతాలను పరిశీలించారు. ట్రాఫిక్ సమస్య లేకుండా వాహనాల పార్కింగ్ తదితర అంశాలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈఈలు సుబ్రహ్మణ్యం, సుధాకర్, డిప్యూటీ ఈఓ ఆశాజ్యోతి, ఆరోగ్య శాఖ అధికారి మధుసూదన్ రావు, విజివోలు సురేంద్ర, రామ్ కుమార్, నంద కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి


పవన్‌కుమార్‌రెడ్డి(ఫైల్)

తిరుపతి రూరల్ : తండ్రికి సాయంగా పంట కోత పనులకు వెళ్లిన బీటెక్ విద్యార్థి ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన ఘటన సోమవారం సాయంత్రం తిరుపతి రూరల్ మండలం సి.గొల్లపల్లి పంచాయతీలో జరిగింది. రూరల్ ఎస్‌ఐ నాగేంద్రబాబు కథనం మేరకు.. గ్రామానికి చెందిన పవన్‌కుమార్‌రెడ్డి(26) బీటెక్ పూర్తి చేసుకుని అమెరికాలో ఎంఎస్ చేసే ప్రయత్నాల్లో ఉన్నాడు. సోమవారం వరి పంటను కోత పనుల నేపథ్యంలో తండ్రి సుధాకర్‌రెడ్డికి సాయంగా పొలానికి వెళ్లాడు. వరికోత మెషీన్‌కు అడ్డుగా ఉన్న విద్యుత్ వైర్లను తొలగించేందుకు యత్నిస్తుండగా చేతిలో ఇనుప రాడ్ ప్రమాదవశాత్తు పైన ఉన్న విద్యుత్ లైన్లకు తగిలింది. దీంతో షాక్‌కు గురై పడిపోయాడు. చికిత్స నిమిత్తం తిరుపతిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తండ్రి సుధాకర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్‌ఐ నాగేంద్రబాబు తెలిపారు. చేతికి అందివచ్చిన కొడుకు కన్నుమూడయంతో తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు.

క్లుప్తంగా

విద్యార్థి అదృశ్యంపై విచారణ


వివరాలు సేకరిస్తున్న ఎంఈఓ రవీంద్రనాథ్

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని కనమనంబేడు గ్రామంలో ఉన్న ఏకలవ్య మోడల్ ఎస్టీ గురుకులం నుంచి పదోతరగతి విద్యార్థి లోకేష్‌నాయక్ శనివారం ఉదయం అదృశ్యమైన ఘటనపై ఎంఈఓ రవీంద్రనాథ్ విచారణ చేపట్టారు. సోమవారం ఈ మేరకు పాఠశాల ప్రిన్సిపల్ ధర్మేంద్రసింగ్‌తో మాట్లాడి వివరాలు సేకరించారు. విద్యార్థి ఎందుకు వెళ్లిపోయాడనే విషయంపై నివేదికను డీఈఓకు అందజేయనున్నట్లు ఎంఈఓ వెల్లడించారు. విద్యార్థి లోకేష్‌నాయక్ హైదరాబాద్‌లోని లింగంపల్లెలో ఉన్నానని బంధువులకు ఫోన్ చేసినట్లు ప్రిన్సిపల్ ధర్మేంద్రసింగ్ తెలిపారు.

గంజాయి విక్రేతల అరెస్ట్


నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

తిరుపతి క్రైమ్ : తిరుపతిలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను సోమవారం అరెస్ట్ చేసినట్లు అలిపిరి డీఎస్పీ వెంకటనారాయణ తెలిపారు. నిందితుల నుంచి 22 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. డీఎస్పీ కథనం మేరకు.. నగరంలోని కపిలతీర్థంరోడ్డులో ఉన్న ఓ హోటల్ వద్ద ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా గంజాయి పట్టుబడింది. నిందితులు మేర్లపాకకు చెందిన కొండముని భరణి, చిత్తూరు జిల్లా సదుం మండలానికి చెందిన పట్టాభి గుణశేఖర్‌గా గుర్తించారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ తెలిపారు. అలిపిరి సీఐ రామకిషోర్ ఉన్నారు.

ఎమ్మెస్సీ సెల్ఫ్ సపోర్టింగ్ కోర్సులను కొనసాగించండి

తిరుపతి సిటీ: ఎస్వీయూలో సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను ఒక్కొక్కటిగా తొలగించడం దారుణమని విద్యార్థి సంఘాలు, పూర్వ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. మార్కెట్‌లో ఎంతో డిమాండు ఉన్న ఎమ్మెస్సీ ఎలక్ట్రానిక్స్ సెల్ఫ్ సపోర్టింగ్ కోర్సు కోసం వెబ్‌ఆప్షన్లలో ఎంత వెతికినా కనబడకపోవడంతో అడ్మిషన్ల కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులకు నిరాశే ఎదురైందని తెలిపారు. ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ కోర్సును పూర్తి స్థాయిలో ఆపివేయాలని కుట్రపూరితంగా కొందరు వర్సిటీ అధికారులను తప్పుదోవపట్టించడం దారుణమన్నారు. ఈ నెల 28వరకు వెబ్‌ఆప్షన్లకు అవకాశం ఉందని, తిరిగి ఎమ్మెస్సీ ఎలక్ట్రానిక్స్ సెల్ఫ్ సపోర్టింగ్ కోర్సును కొనసాగేలా అధికారులు చొరవ చూపాలని ఆ ప్రకటనలో వారు విజ్ఞప్తి చేశారు.

శ్రీకృష్ణావతారంలో నృసింహుడు

రాపూరు : పెంచలకోనలోని శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం దేవదేవేరుల ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం జరిపించారు. అనంతరం భక్తిశ్రద్ధలతో హోమం చేశారు. సాయంత్రం ఉత్సాహంగా ఉట్టి మహోత్సవం చేపట్టారు. స్వామివారిని శ్రీకృష్ణునిగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉభయదేవేరీ సమేతంగా శ్రీవారిని శేషవాహనంపై కొలువుదీర్చి క్షేత్రోత్సవం చేశారు. ఈ క్రమంలోనే గోవులకు విశేష పూజలు నిర్వహించారు. అలాగే రాపూరులోని శ్రీమహావిష్ణువు,అయ్యప్పస్వామి ఆలయాల్లో కృష్ణాష్టమి వేడుకలు చేశారు.


ఉభయదేవేరీ సమేతంగా శ్రీకృష్ణుని అలంకారంలో లక్ష్మీనరసింహస్వామి

ఫుట్‌బాల్ టోర్నీ విజేత నెల్లూరు


ట్రోఫీతో నెల్లూరు జట్టు

నాయుడుపేటటౌన్ : విశాఖపట్నం రైల్వే గ్రౌండ్‌లో నిర్వహించిన ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, ఒడిశా రాష్ట్రాల్లోని జిల్లా జట్ల ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జట్టు విజేతగా నిలిచినట్లు క్రీడాకారుడు సయ్యద్‌గౌస్‌బాషా తెలిపారు. సోమవారం నాయుడుపేటకు చెందిన ఆయన మాట్లాడుతూ టోర్నీలో జిల్లా ఆటగాళ్లు ఉత్తమ ప్రతిభను కనబరచినట్లు వెల్లడించారు. ఈ మేరకు క్రీడాకారులను పలువురు అభినందనలు తెలిపారు.

గ్రాప్లింగ్ రెజ్లింగ్ చాంపియన్‌గా తిరుపతి జట్టు


విజేతలకు షీల్డు అందిస్తున్న నిర్వాహకులు

రేణిగుంట: గ్రాప్లింగ్ రెజ్లింగ్ ఓవరాల్ చాంపియన్‌గా తిరుపతి జిల్లా జట్టు నిలిచింది. రేణిగుంట బాలికోన్నత పాఠశాల క్రీడా మైదానంలో రెండు రోజులుగా జరుగుతున్న 4వ రాష్ట్రస్థాయి గ్రాప్లింగ్ రెజ్లింగ్ పోటీలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో కుస్తీ పోటీలు జరిగాయి. పలువురు పీడీలు, పీఈటీలు అంపైర్లుగా వ్యవహరించారు. ఈ పోటీలలో తిరుపతి జిల్లా జట్టు ప్రథమ స్థానం, ప్రకాశం జట్టు ద్వితీయ స్థానం, కృష్ణా జిల్లా జట్టు తృతీయ స్థానాలలో నిలిచినట్లు రాష్ట్ర గ్రాప్లింగ్ క్రీడ అధ్యక్షుడు ఎం.సురేంద్రరెడ్డి తెలిపారు. ప్రతిభ చూపిన క్రీడాకారులతో రాష్ట్ర జట్టుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. అక్టోబర్ నెలలో హర్యానా రాష్ట్రం రోహ్‌తక్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. పోటీల అనంతరం గెలుపొందిన వారికి షీల్డులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం విష్ణువర్ధనం, ఎస్‌జీఎఫ్–19 సెక్రటరీ జయరామయ్య, రాష్ట్ర క్రీడా భారతి సెక్రటరీ ధనుంజయరెడ్డి ఆర్గనైజింగ్ సెక్రటరీ ఏజీ రేఖారాణి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మత్స్యకారుడి మృతి


పుల్లయ్య (ఫైల్)

వాకాడు : తూపిలిపాళెం సమీపంలోని అందమాల వద్ద సోమవారం రెండు బైక్‌లు ఢీకొనడంతో ఓ మత్స్యకారుడు మృతి చెందాడు. వివరాలు.. తూపిలిపాళానికి చెందిన తులసింగారి పుల్లయ్య(37) బైక్‌పై నెల్లూరు వెళ్లి తిరిగివస్తున్నాడు. ఈ క్రమంలో కోట మండలం గూడలికి చెందిన ఇద్దరు వ్యక్తులు బైక్‌పై తూపిలపాళెం బీచ్‌కు వచ్చి తిరుగుప్రయాణమయ్యారు. మార్గం మధ్యలో రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో పుల్లయ్య అక్కడికక్కడే మరణించాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ నాగబాబు ఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంట మునిగినా.. పంతమే ముఖ్యం!

- చెరువు అభివృద్ధి పనుల అడ్డగింత
- టీడీపీ నేతల కక్షసాధింపు


పంట పొలాలు నీట మునిగిపోతాయంటున్న రైతులు


పనులు అడ్డుకుంటున్న పోలీసులు

పెళ్లకూరు : పంటలు మునిగిపోయినా పర్వాలేదు.. రైతులు నష్టపోయినా ఇబ్బంది లేదు.. తమ పంతం నెగ్గించుకోవడమే ముఖ్యం.. వైఎస్సార్‌సీపీ నేత మాత్రం పనులు చేసేందుకు వీలులేదు అంటూ టీడీపీ నాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. చెరువు అభివృద్ధి పనులను పోలీసులను పంపించి అడ్డుకున్నారు. వివరాలు.. చిల్లకూరు పెద్ద చెరువు కట్ట అభివృద్ధి పనులను టెండర్ విధానంలో వైఎస్సార్‌సీపీ నేత, ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి దక్కించుకున్నారు. వారం రోజులుగా చెరువు కట్ట జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. ఈక్రమంలో కలుజు ఎగువ భాగంలో ఉన్న చెరువు కట్ట వద్ద ఇరువైపులా సిమెంట్ వాల్, గేట్‌కు సంబంధించి ప్రాథమిక దశ పనులు చేస్తున్నారు. ఇందుకు కావాల్సిన కంకర, సిమెంట్, ఇసుకను పని ప్రదేశంలో చేర్చుకున్నారు. అయితే కొందరు టీడీపీ నాయకులు కుట్రపూరితంగా పోలీసు ఉన్నతాధికారులకు తప్పుడు సమాచారం అందించారు. సత్యనారాయణరెడ్డి అక్రమంగా ఇసుక నిల్వ చేసినట్లు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్‌ఐ శ్రీకాంత్ తమ సిబ్బందితో కలిసి వెళ్లి ఇసుక సీజ్ చేస్తున్నామని, అనుమతి లేకుండా తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దీనిపై గ్రామ సర్పంచ్ పగడాల హరిబాబురెడ్డి, ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి మండిపడ్డారు. వర్షాకాలం నేపథ్యంలో త్వరితగతిన చెరువు కట్ట పనులు పూర్తి చేయాలని రైతులు సైతం స్పష్టం చేశారు. వరదలు వస్తే ఆయకట్టు పరిధిలోని పంట పొలాలు నీటమునిగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు ఇచ్చిన తప్పుడు సమాచారంతో పనులు అడ్డుకోవడం అన్యాయమన్నారు. టీడీపీ నేతలు సైతం గ్రామ ప్రయోజనాలను పట్టించుకోకుండా కక్ష పూరితంగా వ్యవహరించడం సరికాదని స్పష్టం చేశారు. వారం రోజులుగా కలవకూరు వద్ద స్వర్ణముఖినది నుంచి 25 ట్రాక్టర్లతో అక్రమంగా ఇసుకను మేనకూరులోని పరిశ్రమలకు తరలిస్తున్నా టీడీపీ నేతలపై పోలీసులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు.

నిబంధనల మేరకే పనులు

ఇరిగేషన్ అధికారుల పర్యవేక్షణలో నిబంధనలు మేరకే చెరువు అభివృద్ధి చేపట్టాం. సిమెంట్ పనులకు సమీపంలోని స్వర్ణముఖినది నుంచి ఎద్దుల బండ్లతో ఇసుక తెచ్చుకున్నాం. టీడీపీ నేతల తప్పుడు ఫిర్యాదుతో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. ఇసుక బిల్లులు లేవంటూ పనులు అడ్డుకుంటున్నారు. అభివృద్ధి పనులకు ఎద్దుల బండ్లతో ఇసుక తెచ్చుకోవచ్చని ముఖ్యమంత్రి ఆదేశాలిచ్చినప్పటికీ పోలీసులు వివక్షతో వ్యవహరించడం సరికాదు. సకాలంలో చెరువు పనులు పూర్తి చేయకుంటే సుమారు 500 ఎకరాల్లో పంట నీట మునిగే ప్రమాదముంది. – కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్